క్లుప్తంగా

తోటల పెంపకానికి 'ఉపాధి' తోడ్పాటు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ చంద్రశేఖర్

ఆదోని రూరల్ : చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని గోనబావి, దిబ్బనగల్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 11 వేల మంది కూలీలు పనులకు వస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకం కోసం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మంజూరైన రైతులకు ప్రభుత్వమే ఉచితంగా గుంతలు తవ్వించి, మొక్కలు నాటించి వాటికి సంవత్సరంలో 40 సార్లు నీరు వేసేందుకు కూడా నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు.

బడి బయటి పిల్లలను గుర్తించండి

పెద్దకడబూరు : బడి బయట ఉండే బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఈ.లింగన్న కోరారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామమూర్తిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వలస కూలీలతో మాట్లాడి వారి పిల్లలను తానే స్వయంగా హాస్టల్‌లో చేర్పించానని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లలను గుర్తించి పాఠశాలలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కౌతాళం: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బసవరాజు కోరారు. శుక్రవారం మండలంలోని బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయ మంటపంలో మండల అధ్యక్షుడు శివనంద అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న నిరుపేద మహిళలు ఆర్థిక సామాజిక పరంగా అభివృద్ధి పథంలోకి రావడానికి సంక్షేమ పథకాల అమలులో వీఓఏ కీలకపాత్ర పోషిస్తున్నారని, నిరంతరం మహిళలకు అందుబాటులో ఉండి సెర్ప్ నిర్వహించే ప్రతి పనిలో పాల్గొని విజయవంతం చేస్తున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కోశాధికారి పద్మావతి, జిల్లా ఈసీ మెంబర్ మిన్నెల్లా మండల కార్యదర్శి రవి, గౌరవ అధ్యక్షుడు అబ్రహం పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండలంలోని కల్లుకుంట గ్రామానికి నౌలేకల్లు గ్రామ పంపింగ్ హౌస్ నుంచి రూ. 20 లక్షలతో చేపట్టే తాగునీటి పైప్‌లైన్‌కు సర్పంచ్ ఇస్మాయిల్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా నెలకొన్ని నీటి సమస్యను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సమక్షంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన ఎమ్మెల్యే నిధుల కింద రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు పూర్తయితే నీటి సమస్య తొలగినట్టేనని చెప్పారు. మాజీ సర్పంచ్ బాలముని, నాయకులు షేర్‌ఖాన్, మహబూబ్‌బాషా, మీసాల నగేష్, దస్తగిరి పాల్గొన్నారు.

కనీస వేతనమివ్వాలి

ఆదోని రూరల్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, బి.రామాంజనేయులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, ఎంఈకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు పనిముట్లు, డ్రస్సులు, రక్షణ సామగ్రిని అందజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.ఎస్.గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన వెంకటేష్ భార్య పార్వతమ్మ శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను బంధువులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో మనస్పర్థలకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు సేవించిందని కుటుంబ సభ్యులు చెప్పారు.

సంతోషంగా ఉంది



ఆదోనిలో కార్వన్‌పేటలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. భర్త, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాం. నా భర్త ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సొంతింటి కోసం ఎన్నో సంవత్సరాలుగా దురుచూశాం. నాయకుల ఇళ్ల వద్దకు, కార్యాలయాలకు దరఖాస్తులు చేతపట్టుకొని ఎన్నో సార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న వచ్చిన తరువాత కొత్తగా స్థలంతో పాటు పక్కా ఇల్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం జరుగుతోంది. త్వరలో గృహ ప్రవేశం చేస్తాం. చాలా సంతోషంగా ఉంది.

– కవిత, కార్వన్‌పేట, ఆదోని

అద్దె ఇంటి బాధ తొలిగింది



కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రతి నెలా అద్దె చెల్లించేందుకు ఇబ్బందిపడ్డాం. మండిగిరి లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేసి ఇల్లు కట్టిస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు. ఇంటి స్థలం ఇచ్చిందే తడువు వెంటనే నిర్మాణం చేపట్టడం ఊహించలేదు. నిర్మాణం పూర్తయితే ఆ ఇంట్లోకి మారతాం. మాకు ఇక ఇంటి అద్దె బాధ తప్పుతుంది.

– ఈరమ్మ, ఎస్‌కేడీ కాలనీ, ఆదోని

సొంత ఇంట్లో చేరబోతున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తున్నాడు. త్వరలో కొత్త ఇంట్లోకి వెళ్తాం. చాలా ఆనందంగా ఉంది. మాకు ఓ సొంతిల్లు ఉందని చెప్పుకోవడానికి గర్వంగా ఉంటుంది. కుటుంబమంతా అందులో సంతోషంగా ఉండటానికి అవకాశముంటుంది. అద్దె కట్టాల్సిన బాధ తప్పుతుంది. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అధికారుల చొరవ అభినందనీయం.

– సునీత, సాయిబాబానగర్, ఆదోని

జగనన్న ఊళ్లు..

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారం
- ఆదోనిలో 9,327 ఇళ్ల స్థలాలు, 7,583 మందికి పక్కా ఇళ్లు మంజూరు
- రూ.47.52 కోట్లతో సకల సౌకర్యాలతో గృహాల నిర్మాణం
- నిత్యం పనులతో సందడిగా జగనన్న కాలనీలు

ఆదోని టౌన్ : పేదల సొంతింటి కల సాకారం చేసే బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల ఇళ్లకు అవసరమైన స్థలాలను ఎంపిక చేసి గ్రామాలు, పట్టణాల్లో ఉన్న నిజమైన ఇల్లు లేని పేదలను గుర్తించి కాలనీలు ఏర్పాటు చేసి అక్కడ వారికి స్థలాలు అందజేశారు. ఆ తరువాత వారందరికీ ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టడంతో దాదాపుగా నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. దీంతో వేలాది ఇళ్లు నిర్మిస్తుండటంతో కొత్తగా ఊళ్లు వెలుస్తున్నాయి.

జోరుగా నిర్మాణాలు..

స్థలాలు మంజూరైన వారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తుంది. అలాగే అవసరమైన ఇసుక, నీటి వసతి ఉచితంగా కల్పిస్తోంది. ఇక సిమెంట్, స్టీల్ తక్కువ ధరకు అందజేస్తుంది. ఇక నిర్మాణాలు చేపట్టలేని వారికి కాంట్రాక్టు పద్ధతిన థర్డ్ పార్టీ విధానంలో నిర్మాణాలు పూర్తి చేసి ఇస్తోంది.

కాలనీల్లో సకల సౌకర్యాలు..

ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యం, బోర్లు వేసి ట్యాంక్‌లు నిర్మించి నీటి వసతి, కుళాయిలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తోంది.ఇప్పటి వరకు నియోజకవర్గంలో వసతులు కల్పన కోసం రూ.15కోట్లు ఖర్చు పెట్టింది.

రాజన్న హయాంలో..

వైఎస్సార్ హయాంలో నియోజకవర్గంలో రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దాదాపు 6 వేల మందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇచ్చారు. అయితే ఆయన మరణానంతరం పేదల ఇళ్లు ఆగిపోయాయి. ఆ తర్వాత ప్రభుత్వాలు పేదోడి సొంతింటి కలను మరుగున పడేశాయి. ఆయన తనయుడు తండ్రి కంటే మిన్నగా ప్రత్యేకంగా ఊళ్లనే తయారు చేస్తున్నారు.

- ఆదోని నియోజకవర్గంలో 9,327 ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు.
- ఇందులో 7,583 ఇళ్లు మంజూరయ్యాయి.
- ఇందుకు రూ.47.52 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- మున్సిపాలిటీ పరిధిలోని మండిగిరిలో మొత్తం 170.81 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటు
- ప్రస్తుతం మూడు లే అవుట్ల పరిధిలో మొదట విడతగా పట్టణంలో 5,957 మందికి, రూరల్‌లో 1626 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు
- అందులో 4,230 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో, రూఫ్ లెవెల్‌లో 106, స్లాబ్ స్థాయిలో 68, నిర్మాణాలు పూర్తయినవి 893.
- ఇళ్ల లబ్ధిదారుల ఖాతాలో జమైన మొత్తం రూ.38 కోట్లు
- కాలనీల్లో సౌకర్యాల కల్పనలో భాగంగా రోడ్లకు రూ.11.93 కోట్లు, నీటి వసతికి రూ.7.69 కోట్లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.14 లక్షలు, స్తంభాలు, తీగల కోసం మరో రూ.10 లక్షలను కేటాయించింది.
- కాలనీల్లో వసతుల కోసం ఖర్చు చేసిన మొత్తం రూ.15 కోట్లు



మండిగిరి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు లాగిన దృశ్యం



ఇళ్ల నిర్మాణం పనులు జరుగుతున్న దృశ్యాలు



ఇంటికి క్యూరింగ్ చేస్తున్న మహిళ

ఇళ్లు నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తున్నాం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తున్నాం. ఏరోజుకారోజు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం పనులు పూర్తయ్యేలా చూస్తున్నాం. హౌసింగ్ అధికారుల వరుస సందర్శనతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన సమాయానికే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేదు. నిర్మాణాలకు సరిపడేంత ఇసుక, స్టీలు, నీటివసతి, సిమెంట్ అందుబాటులో ఉంది. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారు.

.– రవికుమార్, హౌసింగ్ డీఈ

పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అవసరం

కోసిగి: పిల్లలను పాఠశాలలకు చేర్చే ముందు 3 - 5 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో నేర్పించే ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అవసరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ క్యాతాయినీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు- 8,13,14,15 పరిధిలో కార్యకర్తలు పిల్లలతో కలిసి జన భాగీదారి కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. కార్యకర్తలు లూసమ్మ, వరలక్ష్మి, భీమలింగమ్మ, దేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి కోరారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామంలోని 1వ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తుంది రా కార్యక్రమం ని ర్వహించారు. ముందుగా గ్రామంలోని 5 సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ర్యాలీ చేపట్టారు. మహిళా పోలీస్ నాగలక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోసిగి: మండల కేంద్రంలో ఫిట్‌నెస్ లేని వాహనాలు, పరిమితికి మించి నడుపుతున్న ఆరు వాహనాలను సీజ్ చేసినట్లు ఆదోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిర దీప్తి తెలిపారు. శుక్రవారం కోసిగిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ఓ స్కూల్ బస్సు, రికార్డులు లేకుండా నడుపుతున్న ఆటోలు, పరిమితికి మించి నడుపుతున్న వాహనాలను పట్టుకుని జరిమానా విధించినట్లు చెప్పారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యాభివృద్ధికి హెచ్‌ఎంలు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. స్థానిక వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన నాగభూషణంరెడ్డి శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాడు-నేడు కింద పాఠశాలలో భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. ఎస్ఎస్ఎస్ హైస్కూల్ హెచ్‌ఎం మధుసుదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ కళాశాల, హాస్టల్ మంజూరు చేయాలి



సబిహాపర్వీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ముస్లింలు

ఆదోని టౌన్: పట్టణంలోని ముస్లిం,మైనార్టీలకు అనుగుణంగా ఉర్దూ జూనియర్ కళాశాల, హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా ముస్లిం, మైనార్టీ సంక్షేమశాఖ అధికారిణి సబిహా పర్వీన్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో ముస్లిం, మైనార్టీ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఆదోనికి కళాశాల, హాస్టల్‌ను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, ఏపీఎస్ఎంఎఫ్‌సీ డైరెక్టర్ ఎస్‌ఎంబీ అన్ను, వివిధ విభాగాల డైరెక్టర్లు అమ్ము, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

తెర్నేకల్‌లో వైద్య బృందం పరిశీలన



తెర్నేకల్ గ్రామాన్ని సందర్శించిన వైద్యాధికారులు

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో వృద్ధురాలు బజారమ్మకు డెంగీ లక్షణాలు కనిపించడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. సర్పంచ్ అరుణకుమార్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రాముడు, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరయ్య, తదితరులు శుక్రవారం గ్రామంలోని వివిధ కాలనీలను పరిశీలించి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అలాగే బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాలువలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాల శుభ్రత పాటించాలని మలేరియా నివారణ అధికారి సాయిబాబు గ్రామస్తులకు సూచించారు.

దర్గా అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ములుగుందం హుసేన్ సాబ్ దర్గా నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: కుల, మతాలకు గ్రామాల్లో ప్రజలు కలసి, మెలసి జీవించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో శుక్రవారం .. ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో కొలువుదీరిన హుసేన్‌సాబ్ దర్గా మరమ్మతు పనులకు మంత్రి గుమ్మనూరు జయరాం రూ.లక్ష విరాళంగా అందజేశారు. దర్గా నిర్వాహకులకు సొమ్ము అందించారు. దర్గా అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ములుగుందం గ్రామానికి చెందిన హనుమంతు, భీమన్న, చిన్నప్ప, ఖాసీం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంభీమ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

పాఠశాల సమీపంలో ఉన్న పురాతన బావి



కంచె ఏర్పాటు చేయరూ!

ఆదోని సెంట్రల్: పట్టణములోని ఎస్‌కేడీ కాలనీ ఏడవ రహదారి సమీపంలో పురతాన బావి ఉంది. బావికి అతి సమీపంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ప్రక్కనే వార్డు సచివాలయం కూడా ఉంది. పాఠశాలలో నాడు–నేడు పనులు జరుగుతున్నాయి. అలాగే.. విద్యార్థులు అటు ఇటు పరుగెడుతూ, ఆడుకుంటుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. ముందస్తుగా చర్యలు తీసుకొని బావి చుట్టూ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

నిధులు మంజూరు



చెరువులో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని గుడికంబాలి చెరువు మరమ్మతులకు రూ.50లక్షలు మంజూరయ్యాయని మైనర్ ఇరిగేషన్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పనులను త్వరలోనే ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. శుక్రవారం చెరువులో కంపచెట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చెరువు గట్టు కుంగిపోయిందని ఈ నిధులతో బ్రింగ్‌వాల్, సపోర్టింగ్ వాల్, యాప్రన్ వంటి పనులు చేపడతామని వివరించారు. సర్పంచ్ సిద్దేశ్, నాయకులు బసవరాజ్‌ధని, బసప్ప, హనుమయ్య పాల్గొన్నారు.

కల్వర్టులు మరమ్మతులు చేయండి



సుళేకేరి గ్రామం బస్టాండ్ వద్ద శిథిలమైన కల్వర్టు

కౌతాళం: సుళేకేరి గ్రామ బస్టాండ్ వద్ద కల్వర్టు కొంత మేర కూలిపోవడంతో శుక్రవారం రాకపోకలు స్తంభించాయి. కేవలం ద్విచక్ర వాహనాలు, ఆటోలు మాత్రమే ప్రయాణిస్తున్నాయి అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ సాయిసురేష్ మాట్లాడుతూ శనివారం పనుల్ని పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధస్తామని చెప్పారు.

కేసు నమోదు

కృష్ణగిరి: వాటర్ ప్లాంట్‌లోకి అక్రమంగా ప్రవేశించి అందులో పనిచేస్తున్న తనపై దాడి చేసినట్లు కంబాలపాడుకు చెందిన రంగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన రాముగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం సంఘటన వివరాలు తెలుపుతూ.. పొలం పంచాయతీకి సంబంధించి నిందితుడు ఫిర్యాదిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. కేసు విచారిస్తున్నట్లు తెలిపారు.

లారీ బోల్తా



గిరిగెట్ల వద్ద బోల్తాపడిన లారీ

తుగ్గలి: లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ముంబై నుంచి చెన్నైకు కంపెనీ సామగ్రితో వెళుతున్న లారీ శుక్రవారం మార్గమధ్యలో గిరిగెట్ల కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో షోలాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ జ్ఞానేశ్వర్, క్లీనర్ సంతోష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం పత్తికొండ, అనంతపురం ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



డీఐజీని కలిసిన ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: కర్నూల్ రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వై.ప్రదీప్‌రెడ్డి, వై.మనోజ్‌రెడ్డి శుక్రవారం కర్నూల్‌లోని వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిసి శ్రీ రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు అంశాలను గురించి చర్చించారు.

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం



ట్రై మోటార్ సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్ : దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నలుగురు దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి పది ట్రై మోటార్ సైకిళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందుకు దివ్యాంగులు పదో తరగతిపాసై, 90 శాతం వికలత్వం ఉన్న వారు మాత్రమే అర్హులని చెప్పారు.పింఛన్ సౌకర్యం కల్పించడంతో పాటు ట్రై సైకిళ్లు, మూడు చక్రాల మోటార్ సైకిళ్లను అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వికలాంగుల సంఘం జిల్లా చైర్మన్ ముంతాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: బాల్య వివాలను అరికట్టడం అందరి బాధ్యత అని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, పొదుపు సంఘం లీడర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో బాల్య వివాహాల నివారణపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో మండల కమిటీలు నివారణ చర్యలు చేపడతాయన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల నివారణలో భాగంగా గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21ఏళ్లు దాటిన తరువాత వివాహం చేయాలని, బాల్య వివాహాలు చేస్తే చట్ట రీత్యా నేరమన్నారు. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

హొళగుంద: ఆదోని డిపో నుంచి హొళగుంద మండలంలోని వివిధ గ్రామాలకు రద్దు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే గిరి జిల్లా ఆర్టీసీ ఆర్‌ఎం వెంకటరామంను కోరారు. శుక్రవారం ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కర్నూలులో ఆర్‌ఎంను కలిసి బస్సుల రద్దు, రూటు మార్పు కారణంగా ప్రజలు, విద్యార్థులు పడుతున్న అవస్థలను వివరించారు. వెంటనే రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని ఆర్‌ఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు గిరి తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

పత్తికొండ రూరల్: గర్భస్థ శిశువు ఆడ, మగ తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం అని ఆర్డీఓ మోహన్‌దాస్ సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో గర్భస్థ పిండ పరీక్ష నియంత్రణ సబ్ డిస్ట్రిక్ లెవెల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య వివక్ష తగదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ మురళీమోహన్, వైద్యురాలు హారిక, మైత్రిచారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రామ్మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, సుమలత తదితరులు పాల్గొన్నారు.